# మేలో రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు ప్రభుత్వానికి రూ.4987 కోట్ల రాబడి

**ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి వసూళ్లతో**

**వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త చరిత్ర**

**మేలో రూ.4987 కోట్ల భారీ ఆదాయం**



రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి వసూళ్లతో సరికొత్త చరిత్ర సృష్టించింది. గత ఏప్రిల్ నెలలో సాధించిన రికార్డు ఫలితాల పరంపరను కొనసాగిస్తూ, మే 2026 నెలలో రాష్ట్రం రూ.4987 కోట్ల భారీ ఆదాయం ఆర్జించింది. ఇది గతేడాది మేతో పోలిస్తే 19 శాతం అంటే రూ.737 కోట్లు అధికం. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ), అత్యాధునిక డేటా అనలిటిక్స్ వంటి వినూత్న సాంకేతికతను అమలు చేయడం వల్లే ఈ వృద్ధి సాధ్యమైందని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబు పేర్కొన్నారు.ఏపీలో మే నెలకు సంబంధించి నికర జీఎస్టీ వసూళ్లు రూ.3,037 కోట్లు నమోదయ్యాయి. కిందటి సంవత్సరం ఇదే నెలతో పోలిస్తే 16 శాతం అధికం. దీంతో జీఎస్టీ వసూళ్లలో జాతీయ సగటును మించింది. జాతీయ స్థాయిలో సగటు వృద్ధి రేటు కేవలం 6 శాతంగా నమోదు కాగా, ఏపీ 16 శాతం వృద్ధిని సాధించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక 17 శాతం ప్రథమ స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1,94,184 కోట్లు : పొరుగు రాష్ట్రాలైన కేరళ 15 శాతం, తెలంగాణ 14 శాతం, తమిళనాడు 12 శాతం కంటే ఆంధ్రప్రదేశ్ మెరుగైన వృద్ధి రేటుతో ముందంజలో ఉంది. మరోవైపు మే నెలలో దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1,94,184 కోట్లు వచ్చాయి. గతేడాది మే నెలతో పోలిస్తే 3.2 శాతం వృద్ధి నమోదైంది.ఆంధ్రప్రదేశ్? పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అడ్డుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ డిజిటల్ లావాదేవీలను నిశితంగా విశ్లేషిస్తోంది. పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్న 20,391 మంది నమోదు కానీ వ్యాపారులను గుర్తించి, వారిని పన్ను పరిధిలోకి తెచ్చింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్లను విద్యుత్ వినియోగదారుల ఖాతాలతో అనుసంధానించడం ద్వారా నకిలీ చిరునామాలతో చలామణి అవుతున్న సంస్థలకు అడ్డుకట్ట వేసింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఆధారిత వ్యవస్థ ద్వారా తప్పుడు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లను, నకిలీ ఇన్వాయిస్‌లను రియల్ టైమ్‌లో గుర్తించి నోటీసులు జారీ చేస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖ, రెరా, గనులు-భూగర్భ శాఖ డేటాను జీఎస్టీతో అనుసంధానించింది. దీనివల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్ రంగాల్లో పన్ను ఆదాయం గణనీయంగా పెరిగింది. రానున్న రోజుల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతం చేయబోతోంది. రాష్ట్రంలోని 17 డివిజన్లలో ఏఐ ఆధారిత 'రిస్క్ ప్రొఫైలింగ్'ను పూర్తిస్థాయిలో అమలు చేయనుంది. ఈ-వే బిల్లుల పరిశీలనను వేగవంతం చేయడంతో పాటు, పన్ను బకాయిలు చెల్లించని వారిపై బ్యాంక్ అటాచ్‌మెంట్ల ద్వారా వసూళ్లను ముమ్మరం చేయనుంది.

# సోషల్ మీడియాలో 'మ్యాజిక్ లాంతర్లు'

**లైక్? కొట్టారో లైఫ్? ఖతం!**



సామాజిక మాధ్యమాల్లో అమాయకులే లక్ష్యంగా వల - వారి మాయలో పడి అమాయకుల విలవిల - ఉగ్రకోరల్లో చిక్కితే కేసులు తప్పవంటున్న పోలీసులు సోషల్ మీడియాలో పోస్టు నచ్చిందని లైక్ కొట్టారో ఇక అంతే సంగతులు. అసలు దాని ఉద్దేశం ఏమిటో తెలుసుకోకుండా స్పందిస్తే ఉగ్రవాదం కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుసగా జరుగుతున్న ఘటనలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. భావసారూప్యం ఉన్నవారిని గుర్తించేందుకు ఉగ్రవాదులు సోషల్ మీడియా మాటున విసురుతున్న వలలో చిక్కుకొని అమాయకులు విలవిల్లాడుతున్నారు.ఇదిగో ఉదాహరణలు మేడ్చల్‌లోని ఓ హోటల్‌లో సర్వర్ గా పని చేసే యూపీలోని ఘజియాబాద్‌కు చెందిన జయూద్ ఖాన్ (22) ఖాళీ సమయాల్లో బొమ్మ తుపాకులతో రీల్స్? చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్? చేస్తుండేవాడు. అతడి పోస్టులకు పాక్‌లోని ఐఎస్ఐ సానుభూతిపరులు హబీబ్, రాణా హుస్సేన్‌లైక్‌లతో దగ్గరయ్యారు. తర్వాత ఉగ్రవాదం వైపు రెచ్చగొట్టారు. అతడి వాలకాన్ని గమనించిన మేడ్చల్ పోలీసులు, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయిదా బేగం (38) భర్త నుంచి వేరుపడి ఇళ్లలో పని చేసుకుని బతుకుతోంది. ఖాళీ సమయంలో రీల్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేది. ఆమె రీల్స్ కు లైకులు కొట్టడం ద్వారా దగ్గరైన పాకిస్థాన్ ఉగ్రవాద మూకలు క్రమంగా ఆమెలో అదే తరహా భావజాలం నూరిపోశారు. మరి కొంతమంది మహిళలను ఆకట్టుకునేలా సయిదా బేగంతో రీల్స్ చేయించారు. దేశవ్యాప్తంగా మొత్తం 42 మహిళలతో ఒక గ్రూప్ ఏర్పాటు చేసి, వారి ద్వారా విధ్వంసానికి కుట్రపన్నారు. విజయవాడకు చెందిన యువకులను అరెస్టు చేసినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది.ఏపీలోని విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహమాన్ గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమయ్యేందుకు హైదరాబాద్ వచ్చి సోషల్ మీడియాలో జాతి వ్యతిరేక భావాలున్న పోస్టులకు ఆకర్షితుడయ్యాడు. సిరాజ్ ఉద్దేశాన్ని గమనించిన పాక్ ఉగ్రవాద మూకలు, అతడిని నెమ్మదిగా వ్యక్తిగత మెసేజ్?లతో ముగ్గులోకి దింపాయి. ఇలాంటి భావాలే ఉన్న హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌ను పరిచయం చేశాయి. బిహార్?కు చెందిన ఆరిఫ్ హుస్సేన్ నేతృత్వంలో ఇలాంటి భావనతోనే ఉన్న మరికొందరు కలిసి దేశవ్యాప్తంగా పేలుళ్లకు పాల్పడేందుకు సిద్ధమయ్యారు.2025 మే 21న విజయనగరంలో బాంబు పేల్చాలని కుట్ర చేయగా అంతకు 5 రోజుల ముందు విజయనగరం పోలీసులు సిరాజ్‌ను అరెస్టు చేశారు. తర్వాత గల్ఫ్ దేశాలకు పారిపోతున్న ఆరిఫ్?తో పాటు హైదరాబాద్?కు చెందిన సయ్యద్?, మరికొందరిని కూడా అరెస్టు చేశారు.'మ్యాజిక్ లాంతర్?'తో ఆకర్షణ : వారి ఆలోచనలు ఎలా ఉన్నాయంటే చీకట్లో దీపం పెడితే దాని వెలుతురుకు ఆకర్షితులైన కీటకాలు దానిచుట్టూ చేరతాయి. ఉగ్రవాదులు ఆ తరహాలోనే ఆన్‌లైన్ సామ్రాజ్యంలో తమకు అనుకూలమైన వారిని గుర్తిస్తున్నారు. ఈ విధానానికి పెట్టిన పేరే మ్యాజిక్? లాంతర్?. అంతర్జాల ప్రపంచంలో ఉగ్రమూకలు ఉద్దేశపూర్వకంగానే కొన్ని రెచ్చగొట్టే పోస్టులు పెడతాయి. వీటికి ఒకరిద్దరు మాత్రం అనుకూలంగా స్పందిస్తారు. పోస్టు పెట్టకపోయినా లైక్? చేస్తారు. ఇలాంటి వారిని తమదారికి తెచ్చుకుని విధ్వంసం దిశగా ఉగ్రమూకలు సిద్ధం చేస్తాయి. ఇంకో పద్ధతిలో సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టుల్లో తమకు పనికొస్తారని భావించిన వారిని గుర్తిస్తారు. వారి పోస్టులకు లైకులు కొట్టి దగ్గరవుతారు. ఆ తర్వాతే అసలు ఉద్దేశం వెల్లడిస్తారు. ఆ ఉగ్రవాదులు ఇదంతా పకడ్బందీగా ప్లాన్? చేస్తారు. అసలు తామేం చేస్తున్నామో తెలుసుకునేలోపే చాలామంది ఉగ్ర ఊబిలో కూరుకొని పోతున్నారు.పసిగట్టడం తేలికే : ఆన్‌లైన్ ద్వారా ఉగ్రవాద భావజాలం వ్యాప్తి చేయడం ఎంత సులభమో, దర్యాప్తు సంస్థలు కూడా అంతే తేలికగా ఇలాంటి వారిని గుర్తిస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న సమస్త సమాచారాన్ని దర్యాప్తు సంస్థలు నిత్యం వడపోస్తూనే ఉంటాయి. అందుకే చాలామంది కుట్రలు పన్నుతున్నప్పటికీ అవి కార్యరూపం దాల్చేలోపే బట్టబయలవుతున్నాయి. మరీ ముఖ్యంగా జాతి వ్యతిరేక భావజాలం, సంఘ విద్రోహ సమాచారం వంటివి కనిపించినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి సందేశాలు కనిపించిన వెంటనే వాటి నుంచి బయటకు రావడం మంచిదని పోలీసులు సూచిస్తున్నారు.ం

# ఆహార భద్రతపై సర్కార్ ఫోకస్

**ఇకపై హోటళ్లు, ఆహార తయారీ సంస్థలకు రేటింగ్**

**కలుషిత ఆహారం, నీటి కాలుష్య కట్టడిపై ప్రభుత్వం**

**మార్గదర్శకాలు - ప్రమాదకర ప్రాంతాలకు మ్యాపింగ్**



నేటి కాలంలో కాదేది కల్తీకి అనర్హం అన్నట్లుగా ఉంది. ఉరుకుల పరుగుల జీవితంలో అందరూ బిజీ అయిపోయారు. ఇంట్లో వండే తీరిక లేక, కొందరికి ఓపిక లేక, ఆహార పదార్థాలను బయట కొనుగోలు చేస్తున్నారు. ఇదే కొందరు వ్యాపారులకు వరంగా మారింది. ఇష్టమొచ్చినట్లు కల్తీ చేసి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఫలితంగా వీరి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రోజుల తరబడి దుకాణాల్లో నిల్వ ఉన్నా పదార్థాలను బయట పారేయకుండా వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, ఇతర పదార్థాలను వాడుతున్నారు. దీంతో చాలా మంది వీటిని తిని అనారోగ్యానికి గురవుతున్నారు.ఇటీవల అధికారుల దాడుల్లో ఆహార కల్తీ ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అక్రమార్కులు ఆహార కల్తీకి పాల్పడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే కాదు, ప్రభుత్వానికీ సవాల్ విసురుతున్నారు. ఈ క్రమంలోనే కలుషిత ఆహారం, తాగునీటి సమస్యలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ (ఐపీఎం)తోపాటు కీలక శాఖలను ఏపీ సర్కార్ అప్రమత్తం చేసింది. ఆహార కల్తీ కట్టడిలో భాగంగా సమగ్ర వ్యూహాన్ని సిద్ధం చేసింది.లైసెన్స్, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సమర్థంగా నిర్వహిస్తూ నిఘా పెంచాలని ప్రభుత్వం తెలిపింది. ప్రతి ఆరు నెలలకోసారి జిల్లా స్థాయి కమిటీ సమావేశాలు నిర్వహించాలని పేర్కొంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజలు ఎక్కువగా వినియోగించే, త్వరగా కలుషితమయ్యే ప్రమాదం ఉన్న పాలు, పండ్లు, మాంసం, కూరగాయలు, తాగునీరు లాంటి హైరిస్క్ కేటగిరీలపై ఇకపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది. కేవలం ఫుడ్ సేఫ్టీ (ఐపీఎం) మాత్రమే కాకుండా మున్సిపల్, పంచాయతీ రాజ్, తూనికలు- కొలతలు, ఉద్యాన, పశువైద్య శాఖల అధికారులు ఉమ్మడిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సర్కార్ ఆదేశించింది.పరిశుభ్రతకు రేటింగ్ :ఆహార పదార్థాల నాణ్యత పరీక్షకు 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' సంచార వాహనాలను వినియోగిస్తారు. ఇవి మార్కెట్లు, సంతల్లో తిరుగుతూ అక్కడికక్కడే ఆహార నమూనాలను పరీక్షించి ఫలితాలను వెల్లడిస్తాయి. అంతేకాక రెస్టారెంట్లు, హోటళ్లు, ఆహార తయారీ పరిశ్రమల్లో పరిశుభ్రత ప్రమాణాలు తనిఖీ చేసి రేటింగ్ ఇస్తారు. ఆడిటింగ్ నిర్వహిస్తారు. ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటారు.ప్రయోగశాలల బలోపేతం దిశగా :ఫుడ్ సేఫ్టీ విభాగంలో 80 శాతం ప్రయోగశాలల్లో 69 శాతం ఖాళీలు ఉన్నాయి. 150 పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలపడంతో దీనిపై దృష్టిసారించారు.నీటి నమూనాలు, ఆహారం పరీక్షలు చేసి, ప్రమాదకర పరిస్థితులున్న ప్రాంతాలను మ్యాపింగ్ చేసి పర్యవేక్షిస్తారు.ప్రతి తనిఖీ, సేకరించే ఆహార నమూనా, జారీ చేసే నోటీసులు, సీజ్ చేసిన సామగ్రి, కోర్టు తీర్పుల వివరాలు ఎప్పటికప్పుడు ఫోస్కోస్, నిరంతర తనిఖీలు, నమూనాల సేకరణ ద్వారా ఆహార భద్రత నిబంధనల అమలు (ఫోస్కోరిస్) యాప్‌లలో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

# సమర్థ నాయకత్వం, వేగం కారణంగా ప్రపంచపటంలో 'ఏపీ' నిలిచింది

**మంత్రి లోకేశ్**

**డేటా సెంటర్లపై యువతలో భయాన్ని పోగొట్టాలి**

**ముంబయిలో బ్యాంక్ ఆఫ్ అమెరికా సదస్సులో**

**మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు**




సమర్థ నాయకత్వం, స్పీడ్, ఏపీని ప్రపంచపటంలో నిలబెట్టాయని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు. రాష్ట్రానికి గూగుల్ ఎంత ముఖ్యమో చిన్న, మధ్య తరహా కంపెనీలూ అంతే ముఖ్యమని తెలిపారు. డేటా సెంటర్లపై భయాలను పోగొట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్?లో మూడు ఎకనామిక్ రీజియన్స్?ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.'అభివృద్ధికి కొత్త సరిహద్దులు' పేరుతో బ్యాంక్ ఆఫ్ అమెరికా ముంబయిలో నిర్వహించిన సదస్సులో మంత్రి లోకేశ్? పాల్గొన్నారు. భారతదేశాన్ని భవిష్యత్?కు సిద్ధం చేయడం-ఆంధ్రప్రదేశ్ అనుభవం అనే అంశంపై నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్‌లో లోకేశ్? పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, పుట్టపర్తి వద్ద ఐదోతరం ఫైటర్‌జెట్ పరిశ్రమల ఏర్పాటు ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కి నిదర్శనమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందన్నారు. ప్రధాని మోదీ సహకారం, చంద్రబాబు కృషితో పెట్టుబడులను విజయవంతంగా రాబడుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని స్పష్టంచేశారు."మొత్తం ప్రక్రియను సరళంగా, వేగంగా చేయడం, నిలకడ విధానాలకు అనువైన వాతావరణాన్ని కల్పించడం, ఈ మూడూ నేను ఫాలో అవుతాను. గూగుల్ ఎంత ముఖ్యమే చిన్న, మధ్యతరహా పరిశ్రమలూ అంతే ముఖ్యం. ఎంఎస్ఈల వల్ల క్షేత్రస్థాయిల అధిక ఉద్యోగాలొస్తాయి. మా ఎంఎస్ఈ మంత్రి సారథ్యంలో ఇప్పుడు డీమ్డ్ పర్మిషన్స్ విధానాన్ని పరిశీలిస్తున్నాం. దీని ద్వారా పెట్టుబడిదారులు వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. మూడేళ్లలో అనుమతులు వాటంతటవే వచ్చేస్తాయి. అవన్నీ ఆన్‌లైన్ చేయాలనుకుంటున్నాం. ఇప్పటికే నాలా పన్ను చట్టాన్ని సవరించాం. ఇలా చాలా సంస్కరణలు ప్రారంభించాం. అన్నింటికీ సమాధానం లేకపోవచ్చు. కానీ మా ఉద్దేశం సుస్పష్టం. ఎంఎస్ఈల ప్రోత్సాహం దిశగానే రాష్ట్రంలో అడుగులు పడుతున్నాయి." - లోకేశ్, మంత్రి డేటా సెంటర్లపై భిన్నాభిప్రాయాలున్నాయని లోకేశ్ పేర్కొన్నారు. వాటిని పోగొట్టాల్సిన అవసరం ఉందన్నారు. డేటా సెంటర్లు మంచివని కొందరు, చెడ్డవని కొందరు అంటుంటారని చెప్పారు. అవి మంచివి కావని నమ్మే వారితో మాట్లాడటం ముఖ్యమన్నారు! అమెరికా పరంగా చూస్తే అది మంచి ఉదాహరణ కాదన్నారు. భారతదేశంలో వన్ నేషన్ వన్ గ్రిడ్ ఉందని, అమెరికాలో అది లేదని తెలిపారు. నీటి విషయానికొస్తే ప్రతీ సంవత్సరం గోదావరి నుంచి దాదాపు 3,000ల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని పేర్కొన్నారు. ఇది వియత్నాం, బ్రెజిల్ వంటి దేశాల నీటి వినియోగంతో సమానమని లోకేశ్ వివరించారు.'మేం నిర్మించాలనుకుంటున్న 6.5 గిగావాట్ల డేటా సెంటర్లకు కేవలం ఒక టీఎంసీ నీరు చాలు! ఒక గిగావాట్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు, డేటా సెంటర్ కంటే 7 రెట్లు ఎక్కువ నీరు వినియోగిస్తున్నాం. కానీ అంతా డేటా సెంటర్ గురించే మాట్లాడుతున్నారు తప్ప థర్మల్ ప్లాంట్ గురించి మాట్లాడటం లేదు. యువతతో ఈ విషయాలను మాట్లాడం ముఖ్యం. మేం అదే పనిచేస్తున్నాం. డేటా సెంటర్లు వచ్చే ప్రాంత ఎంపీ స్వయంగా యువతను కలిసి ఓపెన్ చాట్ చేస్తున్నారు. అవసరమైతే జోనింగ్ నిబంధనలు ఇంకొంత సవరించడానికీ సిద్ధమే' అని లోకేశ్ పేర్కొన్నారు."ఏఐని ఉపయోగిస్తూ నైపుణ్యాలను పెంచుకుని రీసెర్చ్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కరిక్యులమ్?ను మార్చాల్సిన అవసరం ఉంది. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్ వంటి వాటిని తదుపరి తరం సాంకేతికతలకు అనుగుణంగా మార్చాలి. ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆ విజన్ ఉంది. అందుకే అటు విద్య, ఇటు ఐటీ శాఖలు రెండింటినీ నాకు కేటాయించి వాటిని అనుసంధానించమన్నారు. కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారు మాత్రమే కాకుండా, ఉద్యోగాలు సృష్టించే యువతను తయారు చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం." - లోకేశ్, మంత్రి'కేంద్రం అద్భుతమైన విధానాలను రూపొందిస్తోంది. రాష్ట్రాలు వాటిని సొంతం చేసుకుని అమలు చేయాలి. కొన్ని రాష్ట్రాలు మిగతా వాటి కంటే బాగా పనిచేస్తున్నాయి. ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ అయిన ఏఎంసీఏ ప్రాజెక్ట్ గురించి మాకు 2025 ఫిబ్రవరి, మార్చిలోనే తెలిసింది. నేను, రక్షణ మంత్రిని కలిసి లేఖ ఇచ్చాను. ఆ ప్రాజెక్ట్ గురించి నిరంతరం ఫాలో అప్ చేశాను, ఒకసారి ఆయన సీఎం చంద్రబాబుకి ఫోన్ చేసి తాము సిద్ధంగా ఉన్నాం? ఏపీ సిద్ధంగా ఉందా? అని అడిగారు. కేవలం 36 రోజుల్లో పుట్టపర్తిలో 600 ఎకరాల భూమిని సేకరించి, భారత ప్రభుత్వానికి ఉచితంగా అందించాం. కేంద్ర ప్రభుత్వం ఆశించే వేగం, ఏదో ఒక రాష్ట్రానికే మద్దతు ఇస్తోందనే వార్తలు పూర్తిగా అవాస్తవం. వేగంగా పనిచేసే రాష్ట్రాలకే కేంద్రం మద్దతు ఇస్తుందని' లోకేశ్? తేల్చిచెప్పారు.తాము కేవలం పెట్టుబడుల గురించే కాదని పాలసీలపై ఓపెన్ ఫీడ్‌బ్యాక్ కూడా ఇస్తామని లోకేశ్? స్పష్టంచేశారు. ఉద్యోగాలను సృష్టించే ఏ చట్టాన్నైనా మార్చడానికి, సంస్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. కొలువుల కల్పనే ప్రజాప్రభుత్వ ఏకైక ప్రాధాన్యతని తెలిపారు. తమ లక్ష్యం ఐదేళ్లలో 20 లక్షల జాబ్స్ సృష్టించడమన్నారు. ఆంధ్రప్రదేశ్ 22 క్లస్టర్లను నిర్మిస్తోందన్నారు. తాము కేవలం ఒకే నగరాన్ని కాకుండా, మూడు ఎకనామిక్ రీజియన్స్?ను అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ వెల్లడించారు.

# పక్కా ఇళ్లు వచ్చింది - సామూహిక గృహ ప్రవేశాలతో ఆదివాసీ గూడెం మురిసింది

**కొరారి పంచాయతీ కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లకు సీఎం శ్రీకారం**

**మంత్రులతో కలిసి ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ప్రత్యేక ఆకర్షణగా ఆదివాసీల గుస్సాడి సంప్రదాయ నృత్యాలుఅదో కుగ్రామం**



అక్కడి వారంతా గిరిజన సామాజిక వర్గంలో అత్యంత వెనకబడిన కొలాం తెగవారు. పూరిగుడిసెల్లో జీవిస్తున్న వారికి పక్కా ఇళ్లు కట్టించడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వచ్చి సామూహిక గృహ ప్రవేశాల్లో పాల్గొనడం వారిలో రెట్టించిన ఉత్సాహం నింపింది. జిల్లాల్లోనూ పండుగ వాతావరణంలో మంత్రుల సమక్షంలో గృహ ప్రవేశాలు జరిగాయి.కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని కొరారి పంచాయతీ పరిధిలోకి వచ్చే కొత్తగూడలో కొలాంతెగ ఆదివాసీలకు కేటాయించిన పాతిక ఇళ్లను మంత్రులతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీల గుస్సాడి సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలుత గ్రామ సర్పంచితో కలిసి ముఖ్యమంత్రి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం షేర్ వాల్ సాంకేతికత విధానంతో నిర్మించిన ఇంటిని పరిశీలించారు. ఆదివాసీలతో కలిసి నేలపై కూర్చొని వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన వారికి ఎవరికైనా ఇళ్లు రాకుంటే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ గూడెంలు, గిరిజన తండాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందని సీఎం చెప్పారు.రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు : 'ఈ ఏడాదిలో లక్ష మంది ఇళ్లు కట్టుకున్నారు. వచ్చే సంవత్సరం ఇదే తేదీన అన్ని గూడేల్లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించి పండుగ చేసుకుందాం. అలాగే ప్రత్యేక డ్రైవ్ పెట్టి ఆదివాసీ గిరిజనులకు ఇళ్లు మంజూరు చేస్తాం. గతంలో నిర్మించుకున్న ఇళ్ల పైకప్పు గూన, రేకులు ఉన్న వారికి రెండో విడతలో స్లాబుకు అవకాశం కల్పిస్తున్నాం. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు ఇక్కడి నుంచే మంజూరు చేస్తున్నాం. మహిళలను ఇంటి పెద్దగా గుర్తించి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మిమ్మల్ని చూస్తుంటే దసరాకు వచ్చినట్లు ఉంది. చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుంది. అదొక్కటే కొత్త వెలుగులు నింపుతుంది.' అని సీఎం గూడెం వాసులతో ముచ్చటించారు.ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల పండుగ : రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. జిల్లాల్లోనూ స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కులాస్?పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. లబ్ధిదారుల దంపతులకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే అందించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్ నగర్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. లబ్ధిదారు మహిళలకు సారె సమర్పించారు. భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ఆరో వార్డులో నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. మెదక్ జిల్లా రేగోడు మండలం గజ్వాడ గ్రామంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నాం. పేదలు ఇల్లు కట్టుకోవాలి. ఏదో ఓ రకంగా రెండు, మూడు లక్షలు ఎక్కువైనా పట్టుదలతో ఇల్లు కట్టుకోవడమంటే ఇది సమాజానికి ఒక సందేశం, స్ఫూర్తి. అర్హత ఉంటే ఇల్లు ఇవ్వాల్సిందే. ఎవరికి కూడా ఇల్లు వస్తుందో? లేదో? అనే మాట, సందేహం రాకూడదు" - దామోదర రాజనర్సింహ, వైద్యారోగ్యశాఖ మంత్రి

# సల్మాన్ ఖాన్ కేసుపై సినిమా - బాలీవుడ్‌లో మొదలైన కొత్త వివాదం

**'కాలా హిరన్' సినిమా విడుదల ఆపాలని మేకర్స్‌కు**

**సల్మాన్ ఖాన్ లీగల్ నోటీసు**

**కృష్ణ జింకల వేట కేసు ఆధారంగా ఈ సినిమా నిర్మాణం**

**సోషల్ మీడియాలోని ప్రమోషనల్ కంటెంట్‌ను**

**తొలగించాలని నోటీసులో వెల్లడి**

**సల్మాన్, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ వైరాన్ని కూడా ఈ**

**చిత్రంలో చూపిస్తున్నట్లు సమాచారం**

**వివాదాస్పద చిత్రాల నిర్మాత అమిత్ జానీ ఈ సినిమాకు**

**నిర్మాత**



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన కృష్ణ జింకల వేట కేసు మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ కేసు ఆధారంగా తెరకెక్కుతున్న 'కాలా హిరన్' సినిమా చుట్టూ కొత్త వివాదం రాజుకుంది. ఈ సినిమా విడుదలను తక్షణమే నిలిపివేయాలంటూ సల్మాన్ ఖాన్ లీగల్ టీం.. చిత్ర నిర్మాతలకు లీగల్ నోటీసులు పంపింది. ఈ పరిణామం బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.సినిమాకు సంబంధించిన పోస్టర్లు, ఇతర ప్రచార కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సల్మాన్ తరఫు న్యాయవాదులు తమ నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో 'కాలా హిరన్' విడుదలపై అనిశ్చితి నెలకొంది. మే 29న ఈ సినిమాను ప్రకటించిన కొన్ని రోజులకే ఈ వివాదం మొదలవ్వడం గమనార్హం.భారత్ ఎస్. శ్రీనెత్ దర్శకత్వం వహిస్తున్న 'కాలా హిరన్: ది బాటిల్ ఫర్ లెగసీ' చిత్రానికి అమిత్ జానీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. గతంలో కన్హయ్య లాల్ హత్య కేసు వంటి పలు వివాదాస్పద అంశాలపై సినిమాలు నిర్మించి అమిత్ జానీ వార్తల్లో నిలిచారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. నిజ జీవితంలోని న్యాయ పోరాటాలు, యాక్షన్ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను హాలీవుడ్ తరహాలో నిర్మిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం టీజర్‌ను ఈ నెల 20న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తుండగా, ఇప్పుడు లీగల్ నోటీసులు అందాయి.ఈ సినిమా కేవలం కృష్ణ జింకల వేట కేసుకే పరిమితం కాదని, సల్మాన్ ఖాన్, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ మధ్య ఉన్న వైరాన్ని కూడా సినిమా రూపంలో చూపించనున్నట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్, మొరాదాబాద్ వంటి నగరాల్లో ఈ సినిమా షూటింగ్ జరుపుకుంది. కోర్టు డ్రామా, క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఈ సినిమా ఉండబోతోందని చిత్ర యూనిట్ ప్రకటించింది. తాజా లీగల్ నోటీసులతో ఈ సినిమా భవిష్యత్తు ఏమిటనేది ఆసక్తికరంగా మారింది.

